క్లుప్తంగా

వాహన తనిఖీలు



సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ షేక్ శంకర్

సంతకవిటి: స్థానిక విశాఖ డెయిరీ వద్ద ఎస్‌ఐ షేక్ శంకర్ సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ఆటోలు, క్యాబ్‌లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని తెలిపారు.

స్పాట్ అడ్మిషన్‌లో 80 సీట్ల భర్తీ



స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్న డీసీ పద్మజ, తదితరులు

బాడంగి: ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు సంబంధించి, స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో గురువారం చేపట్టిన స్పాట్ అడ్మిషన్‌లో మొత్తం 80 సీట్లు భర్తీ చేసినట్లు డీసీ టి.పద్మజ తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలురు గురుకుల కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నామన్నారు. విజయనగరం జిల్లాలోని బాడంగి, సాలూరు, కొప్పెర్ల కళాశాలలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని కళాశాలల్లో మొత్తం 157 సీట్ల భర్తీకి ఈ స్పాట్ అడ్మిషన్లు చేపట్టామన్నారు. మిగిలిన సీట్లు కోసం పాఠశాలల పునః ప్రారంభం తర్వాత స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బాడంగి, సాలూరు, కొప్పెర్ల, పార్వతీపురం గురుకులాల ప్రిన్సిపాళ్లు టి.రామదాసు, వి.శ్రీరాములు, ఎల్.పద్మజ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ మధుసూదనరావు తదితరులు

తెర్లాం: విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాల్లోనూ రాణించాలని మండలంలోని విజయరాంపురం సర్పంచ్ బూరి మధుసూదనరావు ఆకాంక్షించారు. గ్రామంలో గతకొన్ని రోజులుగా జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ నేటి బాలలే భావిభారత పౌరులని, విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకుని, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వే



బంగారువలసలో సర్వే చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు లక్షుంనాయుడు, సంగోజి

వంగర: మండలంలోని కొప్పరవలస, బంగారువలస, కె.కొత్తవలస గ్రామాల్లో ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వే గురువారం నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఆర్.లక్షుంనాయుడు, వై.సంగోజి కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రత్యేకావసరాల పిల్లలపై ఆరాతీశారు. అలాగే భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఇప్పటివరకు మొత్తం 15 మంది పిల్లలను గుర్తించామని వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని వీర హనుమాన్ ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం బాలసంస్కార్ చిన్నారులు చేసిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయని ఆలయ ప్రధానార్చకుడు రవిస్వామి తెలిపారు.

అన్నదాతకు అండగా ఆర్‌బీకేలు



నాయుడువలసలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం

- విత్తనం నుంచి విక్రయం వరకు సేవలు
- సకాలంలో ఎరువులు, పురుగుమందుల పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



ఆరికతోట ఆర్‌బీకే వద్ద వరి విత్తనాలు అన్‌లోడ్ చేయిస్తున్న సిబ్బంది(ఫైల్)

రామభద్రపురం:

రైతు సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకేలు)ను ఏర్పాటు చేసింది. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న ఆర్‌బీకేలు అన్నదాతకు అండగా నిలుస్తున్నాయి. విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్నిరకాల సేవలు అందిస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో మొత్తం 94 ఆర్‌బీకేలు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ సంబంధిత పుస్తకాలతో గ్రంథాలయం, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, పశు వ్యాధుల మందులు లభిస్తున్నాయి. వీటితో పాటు వ్యవసాయ పనిముట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. రైతులు దళారుల బారిన పడి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఆర్‌బీకేలు సేవలందిస్తున్నాయి. గతంలో విత్తనాలు, ఎరువులు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. రవాణా చార్జీల భారంతో కొన్నిరోజులుగా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఉన్న ఊరిలోనే అన్నిరకాల సేవలు ఆర్‌బీకేల ద్వారా అందుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ఉపయోగకరం..



రైతు భరోసా కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ఆర్‌బీకే సిబ్బంది సాగులో అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులకు సహాయం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయడం చాలా ఆనందంగా ఉంది.

– ముల్లు సాగర్‌సాయి, రైతు, కొట్టక్కి.

ఉన్న ఊరిలోనే ఎరువులు, విత్తనాలు..



ఉన్న ఊరిలోనే ఎరువులు, విత్తనాలు ఇప్పుడు అందుతున్నాయి. గతంలో వీటి కోసం మండల కేంద్రాలు, ఇతర పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌బీకే వ్యవస్థ ద్వారా రైతుకు వ్యయప్రయాసలు తప్పాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా గ్రామీణ ప్రాంతాలను సందర్శించి, సాగుకు మంచి సూచనలిస్తున్నారు.

– ఆర్నిపల్లి చంద్రునాయుడు, రైతు, నాయుడువలస.

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం..



ఆర్‌బీకేల ద్వారా రైతు సమస్యలకు త్వరితగతిన పరిష్కారం దొరుకుతోంది. గతంలో ఏ సమస్య వచ్చినా మండల కేంద్రాల్లోని వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆర్‌బీకేల వద్ద గ్రామసభలు ఏర్పాటు చేసి మరీ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను అందిస్తున్నారు. ముఖ్యంగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి.

– వెంకటయ్య, ఏవో, రామభద్రపురం.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీఆర్‌పీ పైల తవిటి నాయుడు ప్రకృతి వ్యవసాయ విధానాలు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని, ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

అనంతరం ఘనజీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా చేసి చూపించి, చిరుధాన్యాల ఉత్పత్తి, ఫలితాలను తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ రమణ, సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయిస్తే చర్యలు



రాజాం రైతు బజార్‌లో తనిఖీలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక పట్టణంలోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన.. నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. అక్కడి నుంచి వెళ్లి రోడ్లపై ఉండే తోపుడుబళ్ల వ్యాపారులతో మాట్లాడి, ఎవరూ నిషేధిత పాలిథిన్ సంచులు వినియోగించవద్దని, విక్రయించవద్దని సూచించారు. అలాగే పాలిథిన్, ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.

నిర్మానుష్యంగా రోడ్లు



ఖాళీగా లోకబంధు జంక్షన్ రోడ్డు

బొబ్బిలి: ఎండల తీవ్రత నేపథ్యంలో స్థానిక పట్టణంలోని పలు రోడ్లు గురువారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండల వేడి విపరీతంగా పెరిగిపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జనాలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, రోడ్లు జనాలు లేకపోవడంతో బోసిపోయాయి.

తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి



సమావేశంలో సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని అన్నివార్డుల్లో జరుగుతున్న తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని సచివాలయ సెక్రటరీలను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో గురువారం సమావేశమైన ఆమె.. పైపు లీకేజీలు ఎక్కడున్నా తక్షణమే ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడి, సరిచేయించాలన్నారు. ఎక్కడా తాగునీరు వృథా కావడానికి వీలులేదన్నారు. అలాగే వీధిలైట్లు పోయిన స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయించాలన్నారు. సచివాలయాల్లో జరిగే స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.

అనాథ ఆశ్రమానికి రూ.50 వేలు వితరణ



ఆశ్రమ నిర్వాహకునికి చెక్కు అందిస్తున్న అచ్యుత్‌కుమార్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలో నిర్మాణ దశలో ఉన్న అనాథ వృద్ధాశ్రమానికి దాతలు ఒక్కొక్కరుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. స్థానిక పట్టణంలోని సన్ స్కూల్ కరస్పాండెంట్ భారతి, ఉపాధ్యాయుడు అచ్యుత్‌కుమార్‌లు ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాస్‌కు రూ.50 వేల చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర తెలుసుకోవాలి



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పలువురు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. అనంతరం దేశానికి స్వాంతంత్ర్యం తీసుకురావడంలో మహానుభావులు చేసిన త్యాగం, కృషిని కొనియాడి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు



సంతకవిటి: పుల్లిటలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

రాజాం సిటీ/సంతకవిటి/వంగర/రేగిడి:

మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. రాజాం మండలంలోని బొమ్మినాయుడువలస, గుయ్యానవలస, రామానుజులపేట గ్రామాల్లో గురువారం జరిగిన పనులను ఏపీవో సాయిరాం, సంతకవిటి మండలంలోని సురవరం, పుల్లిట గ్రామాల్లోని పనులను ఏపీవో ఆర్.హరనాథరావు, వంగర మండలంలోని శివ్వాం గ్రామంలో జరిగిన పనులను ఇన్‌చార్జి ఏపీవో హరినారాయణ, రేగిడి మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, లింగాలవలస, తాటిపాడు గ్రామాల్లోని పనులను ఏపీవో ఎస్.హరనాథ్‌లు గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో రెండు పూటలా చల్లగా ఉన్న సమయాల్లోనే పనులు చేయాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూడాలన్నారు. పనిలోకి వచ్చిన వారికే మస్తర్లు వేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని తెలిపారు.



వంగర: చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

వంగర: నవధాన్యాలు సాగు చేసుకుంటే నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని కింజంగి గ్రామంలో రైతులతో గురువారం సమావేశమైన ఆయన.. నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ప్రతీ రైతు నవధాన్యాలను పొలంలో వేసుకుని, అవి మొక్కలైన తర్వాత నేలలో కలియ దున్నుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా పంటకు కావాల్సిన పోషకాలు నేల ద్వారా అందుతాయని, అలాగే పంటకు పట్టే చీడపీడలు నివారించి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న శంకరరావు తదితరులు

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ సిబ్బంది మస్తరు పాయింట్ వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు తదితరులు కలిసి, జెండాను ఆవిష్కరించి, సీఐటీయూ ఆవిర్భావం వెనక ఉద్దేశ్యం, సిద్ధాంతాలు వివరించారు. కార్యక్రమంలో జి.వాసు, బి.వెంకటి, బి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

వంగర: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు సంతకాలు చేసి, కాసేపు కూర్చొని వెళ్లిపోయారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చ జరగలేదు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, మండల పరిషత్ ఏవో లోపింటి త్రినాథ్, డీటీ బూరాడ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లో శివం మందిరం సత్యసాయి భక్తులు గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ గురువారం ఇలా చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చుతున్నామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. మండలంలోని నరసాపురం గ్రామంలో గ్రామపెద్దలు, యువకులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా అన్ని ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు రానున్నాయని, ఆరోజు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగడానికి వీలులేదన్నారు. ఫలితాల నేపథ్యంలో ఎవరూ బెట్టింగ్‌లు చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, ఏఎస్‌ఐ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం



తెర్లాం: శిక్షణకు హాజరైన ఎండీఎం నిర్వాహకులతో ఎంఈవో పాపారావు తదితరులు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మరింత రుచిగా ఉండాలని ఎంఈవో ఆర్.పాపారావు సిబ్బందికి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు రుచికరంగా వంటకాలు వండడంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన.. వంటలు ఏ విధంగా తయారు చేస్తే రుచికరంగా ఉంటాయో వీడియో రూపంలో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం వంటకాలు వండిపెట్టాలని, మెనూ అమలులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో తెర్లాం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.



వంగర: ఎండీఎం నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎంఈవో దుర్గారావు

వంగర: మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎండీఎం(మధ్యాహ్న భోజనం) నిర్వాహకులకు రుచికరంగా వంటకాలు తయారు చేయడంపై గురువారం శిక్షణ ఇచ్చారు. వేడివేడిగా ఉన్నప్పుడు మాత్రమే పిల్లలకు ఆహార పదార్థాలు వడ్డించాలని, మెనూ ప్రకారం వంటకాలు చేసి, పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు, ఎఐఎస్ కో–ఆర్డినేటర్ దార కిరణ్ తదితరులు పాల్గొన్నారు.